
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com



అన్ని పత్రాలు సక్రమంగా ఉండాలి

ఉమామహేశ్వర్ రావు, జిల్లా రవాణా అధికారి



ట్రావెల్ బస్సులు, స్కూల్ బస్సులు తప్పనిసరిగా అన్ని పత్రాలు కల్గి ఉండాలి. యేటా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలి. నిబంధనలు ఉల్లంఘించిన బస్సులను సీజ్ చేస్తాం. ప్రైవేటు ట్రావెల్స్, స్కూల్ బస్సుల్లో ప్రయాణించే వారి భద్రతను దృష్టిలో పెట్టుకొని ప్రతిరోజు తనిఖీలు నిర్వహిస్తున్నాం. నిబంధనలను అతిక్రమించి నడుపుతున్న వాహనాలపై కేసులు నమోదు చేస్తున్నాం.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని.. కర్నూలు శివారులో జరిగిన ఘోర బస్సు ప్రమాదం ఘటన నుంచి అధికార యంత్రాంగం చేరుకునేనా అనే ప్రశ్నలు ప్రతీ సామాన్యుడి మధ్యలో మెదులుతున్నాయి. జిల్లాలో ట్రావెల్ బస్సుల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ జిల్లా గుండా హైదరాబాద్, నాగపూర్, ముంబై, బెంగళూరు, విజయవాడ, తిరుపతి వంటి ప్రాంతాలకు నిత్యం వేలాదిమంది ప్రయాణం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాలకు ఆర్టీసీ ద్వారా బస్సు సౌకర్యం ఉన్నప్పటికీ.. సరైన సమయంలో బస్సులు లేకపోవడంతో సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ప్రైవేటు బస్సుల వైపు మొగ్గుచూపుతున్నారు. ఆర్టీసీ బస్సుల్లో సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉంటుండడంతో ప్రయాణికులు సౌకర్యంగా ఉండే లగ్జరీ బస్సుల వైపు మొగ్గు చూపుతున్నారు. కర్నూల్‌లో జరిగిన బస్సు ప్రమాదం దృశ్య జిల్లా రవాణా శాఖ అధికారులు జిల్లాలోని ట్రావెల్స్ బస్సులతో పాటు స్కూల్ బస్సులను తనిఖీ చేసి నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఓవర్ లోడ్ స్పీడ్ రిస్క్

ప్రైవేటు ట్రావెల్స్‌తో జర జాగ్రత్త..

- కర్నూలు ఘటనతో అధికార యంత్రాంగం అప్రమత్తమయ్యేనా?
- జిల్లా మీదుగా జాతీయ రహదారులు...
- నిత్యం వేలాదిమంది ఇతర ప్రాంతాలకు ప్రయాణం
- 790 కి పైగా పాఠశాల, కళాశాలల బస్సులు
- 205కు పైగా ఆర్టీసీ డీలక్స్, ఇతర బస్సులు
- 200కు పైగా ప్రైవేటు ట్రావెల్స్ వాహనాలు..

నిజామాబాద్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో నిత్యం 790 కి పైగా స్కూల్ బస్సులు రోడ్లపై తిరుగుతున్నాయి. ట్రావెల్ బస్సులు సైతం 200 ల పైనే జిల్లాలో ఉన్నాయి. ఆర్టీసీ ద్వారా నడుస్తున్నటువంటి సూపర్ లగ్జరీ బస్సులు 205 ఉన్నాయి. ఇందులో రాజధాని బస్సులు 24, సూపర్ లగ్జరీ 67, డీలక్స్ బస్సులు 34, ఎలక్ట్రికల్ బస్సులు 80 ఉన్నాయి. స్కూల్ బస్సుల్లో నిత్యం వేలాది మంది విద్యార్థులు ప్రయాణం చేస్తుండగా, ఆర్టీసీ బస్సుల్లోనూ వేలాదిమంది నిత్యం ప్రయాణం చేస్తున్నారు. జిల్లాలో ట్రావెల్ బస్సుల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ టూర్స్, శుభకార్యాలకోసం వీటిని ఎక్కువగా వినియోగిస్తున్నారు. స్కూల్ బస్సులకు సంబంధించి ఫిట్ నెస్ సర్టిఫికెట్లను

(తరువాయి 8వ పేజీలో.....)

వానాకాలం బోనస్

ఖాతాల్లో జమ

» జిల్లా పౌరసరఫరాల అధికారి

నిజామాబాద్, అక్టోబరు 25, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రస్తుతం వానాకాలం సన్న వడ్ల మాత్రమే రైతుల ఖాతాలలో బోనస్ డబ్బులు వేస్తున్నామని జిల్లా పౌరసరఫరాల అధికారి అరవింద్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం వానాకాలం పంట ధాన్యం కొనుగోలు చేస్తున్న క్రమంలో సన్న వడ్ల రైతులకు వారి ఖాతాలలో బోనస్ వేస్తున్నామని ఆయన తెలిపారు. గత యాసంగి సీజన్ కు సంబంధించిన బోనస్ చెల్లింపులు జరగవలసి ఉందని రైతులు ఈ విషయం గమనించాలని ఆయన కోరారు.

ధర్పల్లి ఆదర్శ పాఠశాలకు

ఫైవ్ స్టార్ రేటింగ్

ధర్పల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఏవం హరిత్ విద్యాలయ రేటింగ్‌లో ధర్పల్లిలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల, కళాశాలకు ఫైవ్ స్టార్ రేటింగ్ వచ్చినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. భారత ప్రభుత్వ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా పాఠశాలల పరిశుభ్రత, పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ చర్యలను మూల్యాంకనం చేసే స్వచ్ఛ ఏవం హరిత్ విద్యాలయ రేటింగ్ కార్యక్రమం జిల్లా స్థాయిలో నిర్వహించబడినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఈ మూల్యాంకనంలో మొత్తం 125 మార్కులకు గాను ధర్పల్లి పాఠశాల 114 మార్కులు సాధించి జిల్లాస్థాయిలో అగ్రస్థానంలో నిలిచి ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించిందని ఆయన తెలిపారు. ఈ విజయంలో భాగస్వాములైన టీచింగ్, నాన్ టీచింగ్, సిబ్బంది, విద్యార్థులకు ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలలో మెరుగైన పరిశుభ్రత, పారిశుధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత అలవాట్లను ప్రోత్సహించడం, పచ్చదనం పెంపొందించడం, వంటి పలు అంశాల్లో అత్యుత్తమ ఫలితాలను సాధించినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.



ఇందల్వాయి వద్ద స్వాగతం పలికిన జాగృతి నాయకులు



నిజామాబాదులో జాగృతి కార్యాలయం వద్ద మాట్లాడుతున్న కవిత

ఆడబిడ్డను.. ఆశీర్వదించండి

- ఏ స్థాయిలో ఉన్నా అందుబాటులో ఉంటా..
- నిజామాబాదులో నా ఓటమి కుట్ర నిజం కాదా..?
- ఈ గడ్డ బిడ్డగా ఈ మట్టిలోనే కలిసిపోతా..
- తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు అన్యాయం
- ఆత్మగౌరవంతో కూడిన అభివృద్ధే నా ఆకాంక్ష
- 'జనం బాట' ప్రారంభోత్సవంలో కల్వకుంట్ల కవిత
- ఘన స్వాగతం పలికిన తెలంగాణ జాగృతి నాయకులు

నిజామాబాద్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా కోడలిగా, మీ బిడ్డగా మీ ఆశీర్వాదం కోసం వచ్చానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. జాగృతి 'జనం బాట' ప్రారంభోత్సవ కార్యక్రమంలో శనివారం నిజామాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయం వద్ద ప్రజలనుద్దేశించి మాట్లాడారు. అంతకుముందు హైదరాబాదు నుంచి వచ్చిన ఆమెకు ఇందల్వాయి టోల్ గేట్ వద్ద జాగృతి నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. మాధవ్‌నగర్ నుంచి భారీ బైక్ ర్యాలీతో నగరంలోని జాగృతి కార్యాలయానికి చేరుకున్న కవిత అక్కడ తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం ఆమె మాట్లాడుతూ గత ఐదు నెలలుగా జరుగుతున్న రాజకీయ పరిణామాలతో నిజామాబాద్‌కు రాలేకపోయానని, ఇన్ని రోజుల తర్వాత రావడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా కోడలిగా, ఈ గడ్డ బిడ్డగా ఎప్పటికైనా ఈ మట్టిలోనే కలిసిపోతానని అందుకే మీ ఆశీర్వాదం కోసం వచ్చానని అన్నారు. దేశంలో ఎక్కడ ఉన్నా, ఏ ప్రాంతంలో ఉన్న ఈ గడ్డపైనే మనసు కొట్టుకుంటుందన్నారు.

ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు హెగ్డేవార్ ఈ జిల్లాలోని కందకుర్తిలో పుట్టారని, ఇంకోపక్క మానాల అడవుల్లో ఎన్‌కౌంటర్లు జరిగిన చరిత్ర ఉందన్నారు. ఆర్ఎస్‌యూ నుంచి ఆర్ఎస్ఎస్ వరకు అందరికీ మద్దతు ఇచ్చిన చరిత్ర ఈ జిల్లాకు ఉందన్నారు. టీఆర్ఎస్ పార్టీ నుంచి మొట్టమొదటిసారి జడ్పీ చైర్‌పర్సన్‌గా ఈ జిల్లా నుంచి గెలిచారని, అప్పటినుంచి తెలంగాణ ఉద్యమం ఊపందుకుందని అన్నారు. ఎంపీగా గెలిపిస్తే జిల్లా మర్యాద, గౌరవం కాపాడే విధంగా పనిచేశానన్నారు. గత 20 ఏళ్లుగా తెలంగాణ కోసం, కేసీఆర్ కోసం టీఆర్ఎస్ పార్టీ కోసం పని చేశానని, కుట్ర చేసి తనను బయటకి పంపారన్నారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో తన ఓటమికి టీఆర్ఎస్ నేతలే కుట్ర చేసింది వాస్తవం కాదా అని టీఆర్ఎస్ కార్యకర్తలు ఆలోచించుకోవాలని ఆమె కోరారు.

ఇక్కడ ఏం కుట్ర జరిగిందో చిన్నపిల్లలని అడిగినా చెబుతారని, ఎన్ని అవమానాలు ఎదురైనా తన తండ్రి కోసం, టీఆర్ఎస్ పార్టీ మీద ఉన్న ప్రేమ కోసం భరించానని అన్నారు. ఇంటిగుట్టు బయటపెట్టి నన్ను ఇబ్బంది పెట్టి పార్టీ నుంచి బయటకు పంపారని, ఇప్పుడు సొంత దారిని వెతుక్కునే క్రమంలో జిల్లా ప్రజల ఆశీర్వాదం కోసం వచ్చానన్నారు.

తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు అన్యాయం జరిగిందని, ప్రతి కుటుంబానికి రూ. కోటి సహాయంతో పాటు గుర్తింపు కార్డులు, పెన్షన్ రావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా అనేక హామీలను నిలబెట్టుకోలేదని వాటిపై పోరాటం చేస్తామన్నారు. జనం బాటలో మేధావులు 8లో..

ఎకరాకు రూ.50వేల పరిహారం ఇవ్వాలి

- నష్టం అంచనాలను తక్కువగా చూపారు
- మొక్కజొన్నకు బోనస్ చెల్లించాలి
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

వివరాలు 8వ పేజీలో....



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

కానిస్టేబుల్ కుటుంబానికి

బోధన్ ఎమ్మెల్యే పరామర్శ

సుభాష్‌నగర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో వీర మరణం పొందిన సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబాన్ని శనివారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆ కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని తెలిపారు. ఆ కుటుంబానికి రావాల్సిన ఉద్యోగ విషయమై కలెక్టర్, పోలీస్ కమిషనర్ మాట్లాడారు. అనంతరం ఆ కుటుంబానికి మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌తో మాట్లాడారు. వీధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దాడులు చేస్తూ పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. ఆయన వెంట నుడా చైర్మన్ కేశ వేణు, నాగేష్ రెడ్డి, నరాల రత్నాకర్, తదితరులున్నారు.

బాల్య వివాహం జరిపిస్తే

జైలు, రూ.లక్ష జరిమానా

» జిల్లా బాలల పరిరక్షణ అధికారి చైతన్య కుమార్

మోర్తాడ్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు బాల్యవివాహాలు జరిపిస్తే రెండు సంవత్సరాల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తారని జిల్లా బాలల పరిరక్షణ అధికారి చైతన్య కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం బాల్య వివాహ నిరోదక చట్టం పై గ్రామ, మండల స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మహిళ శిశు సంక్షేమ శాఖ, బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఎంపీడీవో తిరుమల అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చట్టం ప్రకారం యువకుడికి 21 సంవత్సరాలు, యువతికి 18 సంవత్సరాలు నిండకుండా వివాహం జరిపితే ఈ చట్టం ప్రకారం నేరం అవుతుందని ఆయన వివరించారు. బాల్య వివాహం జరిగినప్పుడు 1098 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలని శిక్షణ కార్యక్రమంలో వివరించారు. తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో తిరుమల, ఐసీడీఎస్ సూపర్ వైజర్ మంజుల, కౌన్సెలర్ జంభ్యద్, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సైకిల్ తొక్కుతున్న సీపీ సాయి చైతన్య

పోలీసుల త్యాగాల వల్లనే..

సమాజంలో ప్రశాంతత

» సీపీ సాయి చైతన్య » పోలీసుల అమరుల దినం సందర్భంగా భారీ సైకిల్, బైక్ ర్యాలీ



సైకిళ్లపై ర్యాలీగా వస్తున్న పోలీసులు

సుభాష్ నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పోలీసుల త్యాగాల వల్లనే ప్రజలు, సమాజం ప్రశాంతంగా ఉంటోందని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా శనివారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైకిల్, బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పూలన్ చౌరస్తా నుంచి ప్రారంభమైన ర్యాలీ దేవిరోడ్ కోర్టు చౌరస్తా చెన్నై షాపింగ్ మాల్ ఆర్టీసీ బస్టాండ్ ప్రభుత్వాసుపత్రి దేవి రోడ్డు గాంధీ చౌక్ నెహ్రూ పార్క్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య మాట్లాడుతూ ఎందరో పోలీస్ సిబ్బంది అంతర్గాధ భద్రతను కాపాడడానికి విభజన శక్తుల సవాలను ధైర్యంగా ఎదుర్కొంటూ నేరాలను అరికట్టడంలో మారకద్రవ్యాలను అణిచివేయడంలో ప్రాణాలను అర్పించారని గుర్తు చేశారు. వీరి త్యాగాల వల్లనే దేశం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యంగా కమిషనరేట్ లో ప్రజల కోసం ప్రాణాలు కోల్పోయిన అమరులకు ఈ నెల చెరగని ముద్ర వేసిందన్నారు. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా చూడాలని ఎక్కడ ఎలాంటి సంఘటన చోటు చేసుకున్న వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ మేరకు పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల భాగంగా పోలీస్ కుటుంబాలను పరామర్శించినట్లు తెలిపారు. ఈనెల 29న రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్)బస్వారెడ్డి, అదనపు డీసీపీ (ఏఆర్) రామ్ చందర్ రావు, నిజామాబాద్, ట్రాఫిక్ ఏసీపీలు రాజా వెంకట్ రెడ్డి, మస్తాన్ అలీ, సీఐలు రిజర్వు ఇన్స్‌పెక్టర్లు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, ఆర్మ్డ్ రిజర్వు సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది, ఎన్‌సీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

మత్తు పదార్థాల నిరోధానికి సమష్టి కృషి

నషా ముక్త్ భారత్ అభియాన్ జిల్లా కమిటీ సమావేశంలో కలెక్టర్



క్యూఆర్ కోడ్‌లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయి చైతన్య

సుభాష్‌నగర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల నిరోధానికి కలిసికట్టుగా కృషి చేయవలసిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉన్నదని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శనివారం కలెక్టర్ అధ్యక్షతన నషా ముక్త్ భారత్ అభియాన్ జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులు, కమిటీ ప్రతినిధులు పాల్గొని, జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా, తదితర అంశాలపై కూలంకషంగా చర్చించారు. వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై కమిటీ సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల రవాణా, వినియోగం పెను సవాలుగా మారిందని అన్నారు. యువత, విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తున్న మత్తు పదార్థాలు రవాణా, వినియోగం జరుగకుండా అందరూ కలిసికట్టుగా కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఇది కేవలం ప్రభుత్వ యంత్రాంగాల బాధ్యత అని భావించకుండా సమాజంలోని వివిధ వర్గాల 8వ పేజీలో..

జైతాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల

గృహ ప్రవేశాలు

» పాల్గొన్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

వివరాలు 8వ పేజీలో....



వరద గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

కొనసాగుతున్న ఎస్సారెస్పీ నీటి విడుదల

» ఎగువ నుంచి ప్రాజెక్టులోకి 22 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

వివరాలు.. 8వ పేజీలో...

అభివృద్ధికి ఇం'ధనం'

- కార్పొరేషన్, మునిసిపాలిటీల ప్రగతికి నిధులు
- జిల్లాకు రూ.61.5 కోట్ల విడుదల
- నిజామాబాద్ కార్పొరేషన్ రూ. 25 కోట్లు
- బోధన్, ఆర్మూర్‌కు చెరో రూ.15 కోట్లు
- భీంగల్ పురపాలకానికి రూ.11.5 కోట్లు

నిజామాబాద్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలోని అన్ని కార్పొరేషన్లు మునిసిపాలిటీల రూపురేఖలు మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. గత కొద్దికాలంగా నిధులు లేక చిన్నచిన్న పనులు చేసేందుకు కూడా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని మునిసిపాలిటీలు, కార్పొరేషన్లకు నిధులు కేటాయించింది. ఈ నిధుల ద్వారా కార్పొరేషన్, మునిసిపాలిటీల పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నారు. ఇప్పటికే అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన డీపీఆర్‌ను అధికారులు రూపొందించారు. ఏ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నారో ఆ పనుల వారీగా నివేదికలను అధికారులకు సమర్పించారు. జిల్లాలో నిజామాబాద్ నగరపాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీంగల్ మునిసిపాలిటీలు ఉన్నాయి. ఏడాదికాలంగా కార్పొరేషన్‌తో పాటు మునిసిపాలిటీలకు పాలకవర్గాలు 8వ పేజీలో..



నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

కుక్కకాటుకు గురై విద్యార్థిని మృతి

ముప్కాల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండల కేంద్రానికి చెందిన గడ్డం లక్షిత (10) కుక్కకాటుకు గురై చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి.. లక్షిత స్థానిక కృష్ణవేణి హైస్కూల్‌లో 5వ తరగతి చదువుతోంది. పది రోజుల క్రితం బాల్కొండలోని తన అమ్మమ్మ ఇంటికి వెళ్లగా.. అక్కడ కుక్క గోళ్లతో గీరి గాయపరిచింది. అయితే, చిన్న గాయమేనని తల్లిదండ్రులకు చెప్పకుండా ఉండిపోయింది. కొన్ని రోజుల అనంతరం జ్వరంతో పాటు నీరసించిపోవడంతో కుటుంబ సభ్యులు వివరాలు అడుగగా.. కుక్క గీరిన విషయం తెలిపింది. దీంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. లక్షిత మృతి పట్ల పాఠశాలలో సంతాపం ప్రకటించి విద్యార్థులకు వీధి కుక్కలు, కోతుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కరస్పాండెంట్ విగ్నేష్, ప్రిన్సిపాల్ విజయ్‌కర్తన్ ఈ సందర్భంగా సూచించారు.

క్రైం సమాచారం

రోడ్డుప్రమాదంలో ఒకరి మృతి


కాశీరాం (ఫైల్)

జక్రాన్‌పల్లి, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్గుల్ 44వ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన ఆరేళ్ల కాశీరాం(60) మృతిచెందినట్లు ఎస్ఐ ఎండి మాలిక్ రహ్మాన్ తెలిపారు. కాశీరాం రాత్రి భోజనం చేసి జక్రాన్‌పల్లి వైపు వాకింగ్‌కు వెళ్లగా వెనుక నుంచి వేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి కాశీరాం మృతిచెందారు. మృతుడి కుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ఇరాక్‌లో ఆలూర్ వాసి..


రాజేష్ (ఫైల్)

ఆలూర్, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన కురుమే చిన్న రాజేష్(45) ఇరాక్‌లో మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. కొన్నేళ్ల కిందట ఉపాధి నిమిత్తం ఇరాక్ వెళ్లిన రాజేష్ అక్కడ కార్మికుడిగా పనిచేస్తున్నారు. పనిచేస్తున్న చోట ప్రమాదం జరిగి అక్కడికక్కడే మృతిచెందినట్లు వారు తెలిపారు. రాజేష్ మృతదేహాన్ని రప్పించాలని కోరుతూ సొసైటీ మాజీ చైర్మన్ కల్లెం భోజారెడ్డి, కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇంచార్జి వినయ్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిసి విన్నవించగా వారు రాష్ట్ర ముఖ్య కార్యదర్శి ద్వారా ఇరాక్ ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలిపారు. రాజేష్‌కు భార్య, ముగ్గురు కూతుళ్ల ఉన్నారు.

చికిత్స పొందుతూ..

బోధన్,అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివకృష్ణ(35)అనే వ్యక్తి గురువారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడగా శుక్రవారం సాయంత్రం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నగరంలో గొల్లపల్లి యువకుడి ఆత్మహత్య

సుభాష్ నగర్, అక్టోబర్ 25, (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ నగరంలోని వినాయక్‌నగర్ ప్రాంతంలో డిచ్పల్లి మండలం గొల్లపల్లికి చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు నాలుగో టౌన్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. గొల్లపల్లికి చెందిన సంఘీ ఆకాష్(22) నగరంలోని రిలయన్స్ మార్ట్‌లో గతంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేశాడు. ఓ అమ్మాయితో ప్రేమ విఫలమైన కారణంగా మనస్థాపనకు గురై స్నేహితుల ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తండ్రి రాజేశ్వర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కంటెయినర్ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

ఇందల్వాయి, అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం(బి) వద్ద శనివారం ఉదయం పార్సిల్ కంటెయినర్ డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. హైదరాబాద్ నుంచి పార్సిల్‌తో నిజామాబాద్‌కు వస్తున్న క్రమంలో డ్రైవర్ నిద్రమత్తులో ఉండటంతో డివైడర్‌ను ఢీకొట్టాడు. వాహనం బోల్తా పడటంతో డ్రైవర్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. వెనుక నుంచి ఎలాంటి వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది.

మహిళ అదృశ్యం

బాన్సువాడటౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని పాతబాన్సువాడకు చెందిన ఓ మహిళ అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో శ్రీధర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పాతబాన్సువాడకు చెందిన మురుగల్ల బాలమణి ఈ నెల 23న రాత్రి సమయంలో బయటకు వెళ్లి వస్తానని చెప్పి బయలుదేరిన ఆమె తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఆమె ఆచూకీ గురించి కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా జాడ తెలియ లేదు. బాలమణి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

రెవెన్యూ కార్యాలయానికి ఇసుక వాహనాలు

సాలూర,అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న అక్రమార్కులపై సాలూర తహసీల్దార్ శశిభూషణ్ ఉక్కుపాదం మోపుతున్నారు. గత వారం రోజుల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనాలను పట్టుకుని శనివారం కార్యాలయానికి తరలించారు. 6 ట్రాలీ ఆటోలు, ఒక బొలేరో, 2ట్రాక్టర్లను పట్టుకున్నట్లు వెల్లడించారు.

ఎరాజ్‌పల్లిలో చోరీ

బోధన్,అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరాజ్‌పల్లిలో నల్ల రామకృష్ణ అనే వ్యక్తి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారని బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఈ ఘటనలో రెండు తులాల బంగారు నగలుతో పాటు 16తులాల వెండి, 20 వేల నగదు గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయారని రామకృష్ణ ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామని పేర్కొన్నారు. సీసీ ఫుటేజీల ద్వారా అన్ని కోణాల్లో విచారణ చేపట్టి త్వరలోనే దొంగలను పట్టుకుంటామన్నారు.

కొండచిలువ హతం

నవీపేట,అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దెపల్లిలో శనివారం భారీ కొండ చిలువ హతమైంది. రైతులు వరి కోతలు చేపడుతుండగా పంట పొలాలలో నుంచి సుమారు 10ఫీట్ల పొడవైన కొండ చిలువ రావడంతో అక్కడే ఉన్న పలువురు రైతులు భయాందోళనకు గురై దానిని చంపివేశారు. భారీ కొండచిలువను స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

నాడు సేవాపథం నేడు వృత్తి ధర్మం

▸▸ ఐదేళ్లు సర్పంచులుగా గ్రామాల్లో సేవలు ▸▸ ఎన్నో అభివృద్ధి పనులు

▸▸ పథకాల అమల్లో భాగస్వామ్యం ▸▸ ప్రస్తుతం వివిధ పనుల్లో మాజీ సర్పంచులు

సర్పంచ్ గ్రామ ప్రథమ పౌరుడు.. ఐదేళ్ల పదవీకాలంలో తమదైన శైలిలో ప్రజాసేవ చేసి గుర్తింపు తెచ్చుకుంటారు. అలా పనిచేసి మరిన్ని రోజులు పాలన చేయాలనుకుంటారు. కానీ వారి పదవీ కాలం ముగిసి 21 నెలలైనా ఎన్నికలు రాకపోవడంతో వృత్తి పనుల్లో నిమగ్నమయ్యారు మాజీ సర్పంచులు. తమకు అవకాశం వస్తే పోటీ చేసి గెలిచి, ప్రజాసేవచేస్తామని పేర్కొంటున్నారు.

డొంకేశ్వర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): డొంకేశ్వర్ మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు అభివృద్ధి కీలకంగా ఉండి సీసీ రోడ్లు, మురికి కాలువలు, కుల సంఘాల భవనాల నిర్మాణం, ప్రజా సమస్యల పరిష్కారం వంటి ఎన్నో పనులు వారు చేపట్టారు. పేదలకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేశారు. వీళ్ల పదవీకాలం ముగిసి 21 నెలలు అవుతుంది. తమ చేతుల్లో గ్రామపాలన లేకపోవడంతో.. చాలా మంది మాజీ సర్పంచ్‌లు తమ కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉండేందుకు పనులు చేస్తున్నారు. కొందరు తాము సర్పంచ్ కాకముందు ఏదైతే పని చేశారో అలాంటి చేసుకుంటున్నారు. కొందరు మళ్లీ బీడీలు చుట్టడం, వ్యవసాయం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు.

వ్యవసాయ పనుల్లో నిమగ్నం..

డొంకేశ్వర్ మండలం తొండకూర్ సర్పంచ్‌గా దేవన్న గ్రామంలో ప్రజల మధ్య తిరిగారు. అభివృద్ధి పనుల్లో భాగస్వాములయ్యారు. పదవీకాలం పూర్తయ్యాక గతంలో చేసిన వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. మళ్లీ రిజర్వేషన్ కలిసొస్తే ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ఆయన చెబుతున్నారు.


వ్యవసాయ పనులు చేస్తున్న తొండకూర్ మాజీ సర్పంచ్ దేవన్న

బీడీలు చుడుతూ..

డొంకేశ్వర్ మండలం సిరిపూర్ గ్రామానికి చెందిన తొండకూరు లత సర్పంచ్ పదవీకాలం పూర్తయిన తర్వాత తాను గతంలో చేసిన బీడీల పనినే కొనసాగిస్తున్నారు. మళ్లీ వచ్చే ఎన్నికల్లో రిజర్వేషన్ కలిసి వస్తే పోటీ చేస్తానని ఆమె చెబుతున్నారు. ప్రజల ఆశీస్సులుంటే మళ్ళీ గెలుస్తానన్నారు.


బీడీలు చూడుతున్న సిరిపూర్ మాజీ సర్పంచ్ తొండకూర్ లత

ధాన్యంలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలి


రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

జక్రాన్‌పల్లి, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి):రైతులు ధాన్యం నాణ్యత ప్రమాణాలను పాటించి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని ఆర్మూర్ సబ్ కలెక్టర్ అబిజ్ఞాన్ మాల్వియా అన్నారు. శనివారం మండలంలోని అర్గుల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం కొనుగోలు చేసిన ధాన్యం లారీలలో లోడింగ్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ కిరణ్మయి, సొసైటీ చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి, సహకార శాఖ మండల ప్రత్యేకాధికారి ఆనంద్, విండో కార్యదర్శి తిరుపతి రెడ్డి సిబ్బంది ఉన్నారు.

మనోహరాబాద్‌లో పర్యటించిన నంద్యాల రైతులు


పరిశ్రమను పరిశీలిస్తున్న నంద్యాల రైతులు

జక్రాన్‌పల్లి, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మనోహరాబాద్‌లోని రైతు పసుపు ఉత్పత్తుల పరిశ్రమను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంద్యాల జిల్లా మహానంది ప్రాంత రైతులు శనివారం సందర్శించారు. అనంతరం పరిశ్రమలో పసుపు పొడిని తయారు చేసే యంత్రాలను వారు పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట గుంటూరు సెన్సెస్ అధికారి గురుప్రసాద్, చంద్రశేఖర్‌రెడ్డి, జేఎంకేపీఎం చైర్మన్ తిరుపతి రెడ్డి, రైతులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

మోర్తాడ్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జూనియర్ కళాశాలలో చదివిన దొన్కల్ గ్రామానికి చెందిన తరుణ్ (22) అకాలమరణం చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న జూనియర్ కళాశాల హిస్టరీ లెక్చరర్ పరశురాం పూర్వ విద్యార్థులకు విషయం తెలపడంతో వారు స్పందించారు. తమ మిత్రుడి కుటుంబానికి రూ.7 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో లెక్చరర్ పరశురాం,నవీన్,సహచార మిత్రులు ఉన్నారు.

పంచాయతీ కార్మికుడికి..

సాలూర,అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాజాపూర్ గ్రామ పంచాయతీ వర్కర్ నాగనాథ్ శనివారం రోడ్డు ప్రమాదానికి గురై అకాల మరణం చెందారు. దహన సంస్కారాల కోసం గ్రామ పంచాయతీ నుంచి బాధిత కుటుంబ సభ్యులకు ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో మద్దిలేటి, గ్రామ పంచాయతీ కార్యదర్శి శైలజ ఆర్థిక సహాయంగా 10వేల రూపాయలను అందజేశారు. బాధిత కుటుంబసభ్యులను ఆదుకుంటామని ఎంపీడీవో, అధికారులు భరోసా కల్పించారు.

బీజేపీ నాయకుడికి..

జక్రాన్‌పల్లి, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మన్‌పల్లికి చెందిన బీజేపీ బూత్ అధ్యక్షుడు మోహన్ 10రోజుల క్రితం రోడ్డుప్రమాదంలో గాయపడగా శనివారం ఆయనను బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు వంశీగౌడ్ పరామర్శించారు. అనంతరం మోహన్‌కు రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అధైర్య పడవద్దని, అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో రాజేందర్, అశోక్, పోశన్న, బాలయ్య, భూమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పనులు ప్రారంభం

డొంకేశ్వర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండకూరులో శనివారం సీసీ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూమేష్ రెడ్డి ఆధ్వర్యంలో సురేష్ నగర్ కాలనీలో రూ. 5లక్షల సీఆర్ఆర్ నిధుల ద్వారా ఈ పనులు చేపడుతుండగా కాంగ్రెస్ నాయకులు కొబ్బరి కొట్టి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో వినయ్ కుమార్‌రెడ్డి కృషితో ప్రభుత్వం సీసీ డ్రైనేజీ కొరకు నిధులు మంజూరు చేసిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్దే ధ్యేయంగా పని చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంద మహిపాల్, దేగం గంగారెడ్డి, మాజీ సర్పంచ్ దేవన్న, దశగౌడ్, వైఎస్ గంగాధర్, పరిధ్, ఇసుబ్, తదితరులు పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు


సాలూర: ధాన్యం కుప్పల వద్ద నిలిచిన వర్షపు నీరు


ధాన్యాన్ని చూపిస్తున్న రైతు


ఎడపల్లి: టార్పాలిన్లు కప్పుతున్న రైతులు


మోకన్‌పల్లిలో తడిసిన ధాన్యం

భారీ వర్షం.. అన్నదాత దైన్యం

▸▸ తడిసి ముద్దయిన ధాన్యం ▸▸ కాంటాల కోసం రైతుల ఎదురుచూపులు ▸▸ వర్షపు నీటిలో ధాన్యం కుప్పలు


సాలూర: నీటిని తొలగిస్తున్న రైతులు

సాలూర, మోపాల్, ఎడపల్లి, నవీపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో రైతులు కష్టపడి పండించిన ధాన్యమంతా తడిసిపోవడంతో వాటిని చూసి కన్నీరుమున్నీరు అవుతున్నారు. 2రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ధాన్యపు రాశులు వాన నీటిలో కొట్టుకుపోతున్నాయి.వివిధ మండలాల్లో శనివారం కురిసిన వర్షానికి ధాన్యమంతా తడిసిపోయింది. ధాన్యాన్ని అమ్ముకునే సమయానికి వర్షాలతో అన్నదాత కన్నీరుపెడుతున్నారు. రైతే రాజు దేశానికి అన్నం పెట్టేవాడు రైతు అని పాలకులు గొప్పలు చెప్పుకుంటారే తప్ప రైతులు పడుతున్న బాధను అర్థం చేసుకున్నవారే కరువయ్యారని పేర్కొంటున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనడానికి అటు పాలకులు, ఇటు అధికారులు నానా ఇబ్బందులు పెడుతుంటారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాదికారులు స్పందించి తడిసిన ధాన్యాన్ని కొనాలని పేర్కొన్నారు.


మోపాల్‌లో తడిసిన ధాన్యం →

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

బోధన్,అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల మహిళలు స్కూల్ యూనిఫామ్ కుట్టులకు నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఎస్ఎఫ్ డైరెక్టర్ జాన్సన్ సూచించారు.. శనివారం బోధన్‌లో డ్వాక్రా సంఘాల మహిళలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘాల మహిళలకు టైలరింగ్ శిక్షణ ఇస్తూ స్కూల్ యూనిఫామ్స్, కటింగ్, కుట్టుల నేర్పే శిక్షణ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా రాణించాలన్నారు. మహిళలు ఆర్థికంగా అన్ని రంగాలలో రాణించడానికి ప్రభుత్వం అనేక విధాలుగా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో డీఎస్ఎఫ్ అధికారి మోహన్, ఏపీఎం ముఖీం, ఏపీఎం సాయిలు తదితరులున్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డైరెక్టర్

ధాన్యం అన్‌లోడింగ్ చేసుకునేలా చర్యలు

కోటగిరి,అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): రైస్‌మిల్లర్లు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని తరుగు లేకుండా అన్‌లోడింగ్ చేసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ గంగాధర్ పేర్కొన్నారు. కోటగిరి తహసీల్దార్ కార్యాలయంలో పలువురు నాయకులతో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. కొనుగోలు కేంద్రాలలో 40 కిలోల బస్తాకు కిలోన్నరకు పైగా తరుగు తీస్తున్నారని పలువురు తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. రైస్‌మిల్లర్లతో మాట్లాడి 41కిలోలకే ధాన్యం తీసుకుని అన్ లోడింగ్ చేసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. రైస్‌మిల్లర్లు తరుగు పేరిట కొర్రి విధిస్తే రోడ్డెక్కాల్సి వస్తుందన్నారు. మిల్లర్లతో సమావేశం పెట్టి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మనోహర్, నవీన్, రమణ, వాసు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులపై కేసులను ఎత్తివేస్తూ కోర్టు తీర్పు


న్యాయవాదిని సన్మానిస్తున్న కార్మిక నాయకులు

బోధన్,అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులపై ఉన్న కేసులను ఎత్తివేస్తూ శనివారం కోర్టు తీర్పు ఇచ్చిందని, ఇది కార్మికుల విజయమని బోధన్ ఆర్టీసీ డిపో కార్మిక సంఘాల నాయకులు అన్నారు. కార్మికుల తరపున కృషి చేసిన న్యాయవాది వెంకటేశ్వర్ రావు దేశాయ్‌ను అభినందించారు. 2020లో 55రోజుల సమ్మెలో భాగంగా బోధన్ డిపోనకు చెందిన 26మంది ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మెలో పాల్గొన్నారని తెలిపారు. ఆ సమయంలో ఉద్యోగులపై కేసు నమోదు చేయబడగా ఐదు సంవత్సరాల పాటు కోర్టు చుట్టు న్యాయం కోసం తిరుగగా కోర్టు ఆ కేసును కొట్టివేసిందన్నారు. న్యాయ ప్రక్రియలో నిరంతరం కృషి చేసిన న్యాయవాదుల కృషి ఫలితంగా కోర్టు కేసు గెలిచామని, ఇది ఆర్టీసీ సిబ్బంది ఐక్యతకు నిదర్శనమన్నారు. బోధన్ డిపో జేఏసీ తరపున కృతజ్ఞతలు తెలిపారు. సహకారం అందించిన వెంకటేశ్వర్‌రావుదేశాయ్, శివసాయి పటేల్, కృష్ణగౌడ్‌ను శనివారం సన్మానించారు.

విద్యార్థులకు తరగతులు

వేల్పూర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కుకునూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం హరిచరణ్ తెలిపారు. పాఠశాల సమయం ముగిసిన తర్వాత సాయంత్రం పదవ తరగతి విద్యార్థులతో పాటు 6 నుండి 9వ తరగతి విద్యార్థులకు సాయంత్రం ఒక గంట పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.


బోధన్‌లో పోలీసుల సైకిల్ ర్యాలీ


మోర్తాడ్‌లో మాట్లాడుతున్న ఎస్ఐ రాము


వర్నిలో సైకిల్ ర్యాలీలో పాల్గొన్న పోలీసులు

పోలీసు అమరులను స్మరించుకుందాం

▸▸ జిల్లాలోని పలు మండలాల్లో పోలీసు అమరుల సంస్మరణ వారోత్సవాలు ▸▸ భారీగా బైక్ ర్యాలీల నిర్వహణ

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని నిజామాబాద్ జిల్లాలోని పలు మండలాల్లో బైక్ ర్యాలీలు నిర్వహించారు. పోలీసులు జనాలలో నమ్మకం కలిగి వారి భద్రతకు నిరంతరం పనిచేస్తారని తెలిపారు. అంతకుముందు విధుల్లో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరులకు నివాళులు అర్పించారు. సమాజ భద్రత కోసం ప్రాణాలను పణంగా పెట్టిన త్యాగాల కుటుంబాలకు ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ త్యాగమూర్తులను స్మరించుకుందామన్నారు. ఈ ర్యాలీలో పోలీస్ సిబ్బంది, స్థానిక నాయకులు యువకులు పాల్గొన్నారు. - ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్


నందిపేటలో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు


భీమ్‌గల్‌లో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అంగన్‌వాడీ టీచర్‌ను తొలగించడం సరికాదు


సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బోధన్,అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి మండలంలో అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న సిలువేరి బాలమణిని విధుల నుంచి తొలగించడం సరికాదని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు రమేష్ బాబు అన్నారు. శనివారం బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు వినతిపత్రం అందించారు. కమ్మర్‌పల్లిలో విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్ బాలమణి సక్రమంగా విధులు నిర్వహిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌గా అవార్డులు తీసుకుందన్నారు. క్రమశిక్షణతో పని చేసే ఆమె పట్ల అంగన్‌వాడీ సెంటర్‌లోని గుడ్లను అమ్ముకున్నారనే ఆరోపణలు చేయడంలో నిజం లేదన్నారు. ఐసీడీఎస్ అధికారులు ఎటువంటి విచారణ చేపట్టకుండా అంగన్‌వాడీ టీచర్‌ను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం సరికాదన్నారు. వెంటనే ఆమెను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్షురాలు మంగదేవి, కార్యదర్శి విక్టోరియా రాణి, టీచర్లు అనీస్, వర్షల, లావణ్య, రేణుక, పద్మ, ఎలిజాబేత్ రాణి, శ్యామల, గంగామణి, కళావతి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

వేల్పూర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ క్రాస్‌రోడ్డు వద్ద 63వ జాతీయ రహదారి సమీపంలో శుక్రవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌లను తనిఖీ చేశారు. హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు జరిమానా విధించారు. వాహనదారులు అన్ని పత్రాలు వెంట ఉంచుకోవాలని, తాగి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. కారు డ్రైవింగ్ చేసేవారు బెల్టు, ద్విచక్రవాహన దారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని పేర్కొన్నారు.

పంపుల పంపిణీ

వర్ని, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాకోరలో శనివారం రైతులకు పురుగుమందు పిచికారీ పంపులను మార్కెట్ కమిటీ చైర్మన్ కులకర్ణి సురేష్ బాబా అందజేశారు. 75 శాతం సబ్సిడీతో ఈ పంపులను పంపిణీ చేసినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ తెలిపారు. రైతులకు సబ్సిడీ ద్వారా పంపులను అందజేయడం మంచి పరిణామం అన్నారు. రైతులు రాయితీ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విండో చైర్మన్ దశరథ్, అబ్దుల్ బారీ, రమేష్ గౌడ్, కిషన్, బోడో ల్ల బాలయ్య, కాంతా రావు పాల్గొన్నారు.

రైతుల నిరసన

ఎడపల్లి,అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తరలించి ధాన్యం తూకం వేశాక మిల్లుకు పంపిస్తే మిల్లు యజమాని అధిక తరుగు ఇస్తేనే ధాన్యం దించుకుంటామని, లేకపోతే దించుకోమనడంతో రైతులు ఆందోళన చెందారు. తమ ధాన్యం ప్రభుత్వం కొనుగోలు కేంద్రంలో ఉన్న షరతులకు లోబడే ఉన్నా మిల్లు యజమాని బస్తాకు కిలో తరుగు ఇస్తే తప్ప బస్తాలు దించుకోము అనడంతో శనివారం రైతులు మిల్లు దగ్గర తమ వరి దాన్యం లోడుతో ఉన్న లారీ వద్ద నిరసన చేపట్టారు. మండల కేంద్రంలో ఇందిరా క్రాంతి పథకం ద్వారా ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఐదుగురు రైతుల తమ వరి ధాన్యాన్ని తూకం వేసిన 40కిలోల బస్తాలను దాదాపు 630 బస్తాలను లారీలో నింపి కొనుగోలు కేంద్రం వారు అనుమతి ఉన్న మండలంలోని సాటాపూర్ గేటు వద్ద గల ఆల్ నూర్ మిల్లుకు తరలించారన్నారు. మిల్లుకు వచ్చాక మిల్లు యజమాని తరుగు ఇస్తే తప్ప బస్తాలు దించనని అంటున్నారని, మూడు రోజుల కిందట లారీ మిల్లుకు వచ్చిందని, అప్పటి నుండి మేము మిల్లుకు తిరుగుతూనే ఉన్నామని పేర్కొన్నారు. ఇప్పుడు తాము ఏం చేయాలి అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు. వారి వెంట ఎడపల్లి గ్రామానికి చెందిన రైతులు తదితరులు ఉన్నారు.

పనులు వేగవంతం చేయాలి



ఇంటిపత్రాలు అందజేస్తున్న ఎంపీడీవో

పిట్లం, అక్టోబరు 25,(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఎంపీడీవో రఘు తెలిపారు. శనివారం శాంతినగర్ కాలనీలో నూతనంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు హనుమాండ్లు అందజేశారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణ పనులు ప్రతిరోజు ఆయా గ్రామాలలో కార్యదర్శులతో వెళ్లి పరిశీలించి పనులు విజయవంతంగా చేయాలని లబ్ధిదారులకు సూచిస్తున్నామన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

పిట్లం, అక్టోబరు 25, (ఆంధ్రజ్యోతి): హస్నాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ బీజేపీ పార్టీలకు చెందిన పలువురు నాయకులు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు హనుమాండ్లు పార్టీలో చేరిన నాయకులకు కండువా కప్పి ఆహ్వానించారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు చేస్తున్న అభివృద్ధి పనులను చూసి పార్టీలో చేరామన్నారు. ఏఎంసీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు రామ్ రెడ్డి, గోపాల్ రెడ్డి, కాశీరాం, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు.. రూటు సపరేటు

- వసతులు లేని ప్రైవేట్ పాఠశాలలు
- అధిక ఫీజులు వసూళ్లే లక్ష్యం
- క్రీడా స్థలాలు, డైనింగ్ హాల్‌లు కరువు

జుక్కల్, అక్టోబరు 25, (ఆంధ్రజ్యోతి): జుక్కల్ మండల వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో కొన్నిచోట్ల యజమానులు అధిక ఫీజులు వసూలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారనే ఆరోపణలున్నాయి. పాఠశాలల్లో విద్యార్థులకు సరైన వసతులు ఏర్పాటు చేయకుండా విద్యను వ్యాపారంగా భావించి రూ.లక్షల్లో సంపాదిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రైవేట్ పాఠశాల్లో ఫైర్ సేఫ్టీ, విద్యార్థులకు ఆడుకోవడానికి క్రీడా స్థలాలు, భోజనాలు చేయడానికి డైనింగ్ హాలు, విశాలమైన గాలి వెలుతురు ఉండేలా గదులనిర్మాణం చేయాలి. అయితే ఇవేమీ పట్టించుకోకుండా కొన్ని పాఠశాలల యజమానులు నిబంధనలను తుంగలో తొక్కి వారి ఇష్టానుసారంగా నలుగురు వ్యక్తుల సిండికేట్‌తో ఏర్పడి ప్రైవేట్ పాఠశాలలు ఏర్పాటుచేసి ఇరుకు గదులు నిర్మించి నడిపిస్తున్నారు. వసతులు లేకుంటే తమకు అడిగే వారు లేరని ఒంటెద్దు పోకడ అవలంబిస్తున్నారు.

దూరంగా ఉండటమే కలిసొస్తుందా..

జుక్కల్ మండలం జిల్లా కేంద్రానికి దూరంగా ఉండి కర్ణాటక మహారాష్ట్ర సరిహద్దులో ఉండడంతో ఉన్నత అధికారుల తనిఖీలు నామ మాత్రంగా ఉంటాయన్నది కాదనలేని ని జం. కాగా అధికారుల పర్యవేక్షణ లోపా న్ని ఆసరా చేసుకుని పాఠశాల యజమా నులు సందట్లో సడేమియా అన్నట్లు వి ద్యను వ్యాపారంగా మల్చుకొని లక్షలు సం పాదించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నారు. విద్యహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశా లలో 25 శాతం నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్యాబోధన నిర్వహించాలని నిబంధన ఉంది. ఈ నిబంధనను యజమానులు అమలు చేయకపోవడంతో రికార్డులకు పరి మితం చేస్తున్నారని విమర్శలు ఉన్నాయి. మండలంలో అక్షరాస్యత తక్కువ ఉన్నప్పటికీ విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద ప్రశ్నించేతత్వం లేకపోవడంతో వారి అమాయకత్వాన్ని యజ మానులు ఆసారగా చేసుకొని నాణ్యత లేనివి విద్యాబోధన జరుపుతూ అందిన కాడికి ఫీజులు దోచుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలో విద్యా ర్థులకు ఇంగ్లీష్ మీడియం బోధన నిర్వహిస్తు న్నప్పటికీ ఉపాధ్యాయులు కొన్ని పాఠశాలల్లో క్వాలిఫైడ్ లేని ఉపాధ్యాయులతో విద్యాబోధన జరుగుతుంది. 30 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయున్ని నియమించాలి. కానీ పాఠశా ల యజమానులు ఒకే గదిలో సుమారు 50 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుని నియ మించి విద్యాబోధన జరుగుతోంది. పాఠశాల్లో బస్సులు ఏర్పాటుచేసి టై, బెల్టు యూనిఫామ్ లు పంపించి అధిక డబ్బుల వసూళ్లకు తెరలేపారు. రాష్ట్ర ఆర్జేడీ అధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి జుక్కల్ మండలంలో నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలల్లో వెంటనే తనిఖీలు చేపట్టి తగు చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు ఉన్నాయి.



కండేబల్లూర్ ప్రైవేట్ పాఠశాలలో నేలపైనే కూర్చొని భోజనం చేస్తున్న విద్యార్థులు

చర్యలు తీసుకుంటాం

మండల కేంద్రంతో పాటు గ్రామీణ ప్రాంతంలో నిర్వహిస్తున్న వసతులు లేని ప్రైవేట్ పాఠశాలలపై తనిఖీలు చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాం. నిబంధనల మేరకే ప్రైవేట్ పాఠశాల నిర్మించేలా చూస్తాం.

● తిరుపతయ్య, ఎంఈవో, జుక్కల్

ఆరోగ్యవంతమైన సమాజం కోసం కృషిచేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడటౌన్, అక్టోబరు25,(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. శనివారం పట్టణంలోని రెడ్డిసంఘ భవనంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణమాసం కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పౌష్టికాహారం గురించి ప్రతి ఇంటిలో అవగాహన కల్పించడమే పోషణమాసం కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఒక కుటుంబం ఆరోగ్యంగా ముందుకెళ్లాలంటే మహిళల పాత్ర కీలకమన్నారు. ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండేందుకు పోషణపై అంగన్‌వాడీలు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా గర్భిణుల పోషణస్థితిని మెరుగుపచినట్లయితే భావితరాల పిల్లలు పోషణ లోపం లేకుండా ఆరోగ్యంగా జన్మిస్తారని తెలిపారు. అనంతరం చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో సీడీపీవో సౌభాగ్య, మాజీ మున్సిపల్ చైర్మెన్ జంగం గంగాధర్, నాయకులు ఏజాస్, శ్రీధర్, గోపాల్‌రెడ్డి, గౌస్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పోచారం

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

బాన్సువాడటౌన్,అక్టోబరు25,(ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా నివారించాలో శనివారం బాన్సువాడ అగ్నిమాపక శాఖాధికారి సలీం విద్యార్థులకు అవగాహన కల్పించారు. పట్టణంలోని రిఫుల్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా అగ్నిమాపక శాఖ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అగ్నిప్రమాదాలు ఏవిధంగా సంభవిస్తాయో, వాటిని ఎలా నియంత్రించాలో ప్రదర్శన ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎక్కడైనా అగ్నిప్రమాదం సంభవిస్తే 101కు డయల్ చేసి సమాచారం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సునీల్, హరిసింగ్, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

అభివృద్ధి చేయడమే పోచారం సంకల్పం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

బాన్సువాడటౌన్, అక్టోబరు 25, (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ధృడసంకల్పమని సొసైటీ చైర్మన్ ఎర్వల కృష్ణారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని పోచారం నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా స్పందించారు. నియోజకవర్గంలో అభివృద్ధి కావాలంటే నిధులు ఎంతో అవసరమని, అందులో భాగంగానే తమ నాయకుడు పోచారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారన్నారు. 2004లో బాన్సువాడలో గెలిచిన బాజిరెడ్డి ఎంతమేర అభివృద్ధి చేశారు, మళ్లీ 2009లో ఓడిన తర్వాత బాన్సువాడను వీడి ఎందుకు వెళ్లారో ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం బాన్సువాడ నియోజకవర్గానికి రూ.150 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు, రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల, రూ.47 కోట్లతో ఐటీఐ కళాశాల, జలాల్‌పూర్ వద్ద రూ.5 కోట్లతో సబ్‌స్టేషన్, 3500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయించిన ఘనత పోచారందేనన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గురువినయ్, వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు పిట్ల శ్రీధర్, మాజీ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, మాజీ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నార్ల సురేశ్, నాయకులు గోపాల్‌రెడ్డి, ఏజాస్, ఖలేక్, దాసరి శ్రీనివాస్, మన్సూర్ తదితరులున్నారు.

సూరీడు పూసిన సోలార్ పుష్పం..



పెద్దకొడప్గల్‌లోని 161వ జాతీయ రహదారిపై ఆయా ప్రాంతాలలో వాహనాల వేగాన్ని తెలుసుకునేందుకు గాను హైవే అధికారులు అక్కడక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అయితే సీసీకెమెరాలు పనిచేసేందుకు గాను సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. కాగా శనివారం సాయంత్రం హైవేపై ఏర్పాటు చేసిన ఓ సోలార్ ప్యానెల్ చివరన సూరీడు అస్తమిస్తూ దీపంలా దర్శనమిచ్చింది. దీంతో ఆ సమయంలో అటుగా వెళ్లే వాహనదారులు వాహనదారులు ఈ చిత్రాన్ని ఆసక్తిగా తిలకించారు. కొంతమంది సెల్‌ఫోన్‌లలో ఫొటోలు తీసుకున్నారు. ఈ దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి క్లిక్‌మనిపించింది.

● పెద్ద కొడప్‌గల్, ఆంధ్రజ్యోతి

రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి కొత్త బాధ్యతలు

సుభాష్‌నగర్, అక్టోబరు, 25 (ఆంధ్రజ్యోతి), జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో ఎనిమిది డివిజన్లకు ఇంచార్జిగా నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ఉపఎన్నికల నేపథ్యంలో శనివారం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు ఈ సమావేశంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని జూబ్లీహిల్స్ పరిధిలోని ఎనిమిది డివిజన్లకు ఇంచార్జిగా నియమించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమని జోస్యం చెప్పారు. ప్రజా ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పిస్తామని చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్‌ను అధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. తనకు కేటాయించిన ఎనిమిది డివిజన్లలో ఇంటింటికీ తిరిగి పార్టీకి ఓటు వేయాలని ప్రజలను కోరుతానని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డివిజన్ ఇన్‌చార్జీలు, డివిజన్ అధ్యక్షులు, బూత్ స్థాయి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



తడిసిన వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

నసురుల్లాబాద్, అక్టోబరు 25, (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుర్కి గ్రామంలో శుక్రవారం కురిసిన వర్షానికి ఆరబెట్టిన వరిధాన్యం తడిసి ముద్దయింది. దీంతో బీజేపీ నాయకులు గ్రామానికి చేరుకొని తడిసిన వరి ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లాధ్యక్షుడు నీలం చిన్న రాజులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఫసల్‌బీమా యోజన అమలుచేసి ఉంటే రైతులకు నష్టపరిహారం వచ్చేదని, రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు వర్షాలు పడి రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. రైతులకు రైస్ మిల్ యజమానులు గాని, సహకార సంఘాలు ఎలాంటి ఆంక్షాలు పెట్టకుండా మ్యాచర్ చూడకుండా వరి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షులు చందూరి హన్మాండ్లు, సున్నం సాయిలు, కోనాల గంగారెడ్డి, గుడుగుట్ల శ్రీనివాస్, చిదుర సాయిలు, శంకర్ గౌడ్, పైడిమల్ లక్ష్మి నారాయణ, డౌ బిజెపి నాయకులు పాల్గొన్నారు.

నగదు జమ.. రైతుల సంబరాలు

నాగిరెడ్డిపేట, అక్టోబరు 25, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారెడ్డి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో జిల్లాలో మొట్టమొదటిగా 48 గంటల్లోనే డబ్బులు జమయ్యాయి. దీంతో కొనుగోలు కేంద్రం వద్ద రైతులు, ఐకేపీ సిబ్బందితో కలిసి శనివారం టపాకాయలు పేల్చి, మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకొన్నారు. ధర్మారెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి 11 మంది రైతులకు చెందిన 528.80 క్వింటాళ్ల వరి ధాన్యాన్ని రెండు లారీల్లో లోడ్‌చేసి రైస్ మిల్లులకు తరలించారు. రైతుల వివరాలను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసిన 48 గంటల వ్యవధిలో రైతుల ఖాతాల్లో రూ.12,63,303 జమ అయినట్లు ఐకేపీ ఏపీఎం రాంనారాయణ గౌడ్ తెలిపారు. కొనుగోలు కేంద్రం ఇంచార్జి దత్తు, రైతులు పాల్గొన్నారు.



సంబరాలు జరుపుకొంటున్న రైతులు, ఐకేపీ సిబ్బంది

పొరపాట్లు లేకుండా చూడాలి

సుభాష్‌నగర్, అక్టోబరు 25, (ఆంధ్రజ్యోతి): ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సూచించారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర అదనపు ముఖ్య ఎన్నికల అధికారి లోకేష్ కుమార్, ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, ఈఆర్‌ఓలతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2002 ఎలక్టోరల్ జాబితాతో నియోజకవర్గాల వారీగా 2025 ఎలక్టోరల్ జాబితా మ్యాపింగ్ చేసి 4 కేటగిరీలుగా విభజించడం జరిగిందన్నారు. ఇందులో కేటగిరీ "ఎ"లో 1987 కంటే ముందు జన్మించి 2002, 2025 ఎలక్టోరల్ జాబితాలో నమోదైన వారు, కేటగిరీ "బి" లో 1987 కంటే ముందు జన్మించి 2002 ఓటరు జాబితాలో లేకుండా 2025 జాబితాలో నమోదైన వారు, కేటగిరీ "సి" లో 1987-2002 మధ్య జన్మించి 2025 ఓటరు జాబితాలో నమోదైన వారు, కేటగిరీ 'డి' లో 2002-2007 మధ్యలో జన్మించిన వారీగా విభజించామన్నారు. కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. బీఎల్వోలు, బీఎల్‌వో సూపర్ వైజర్లకు శిక్షణ ఇస్తున్నామన్నారు. మొదట కేటగిరి 'ఏ' ఓటరు జాబితాను బీఎల్వో యాప్ ద్వారా నిర్ధారించిన తర్వాత కేటగిరీ సి, 'డి' లను కేటగిరీ 'ఎ'కు లింక్ చేస్తున్నామని, పొరపాట్లకు తావు లేకుండా, దశలవారీగా పూర్తిచేస్తామన్నారు. జిల్లాలో 50 శాతం మ్యాపింగ్ పూర్తయ్యిందని అన్నారు. అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్, హౌసింగ్ పీడీ పవన్, ఎన్నికల విభాగ పర్యవేక్షకుడు ధన్వాల్ పాల్గొన్నారు.

న్యాయం చేయాలని డైరెక్టర్ల వినతి

నాగిరెడ్డిపేట, అక్టోబరు 25, (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండూర్ కిచ్చన్నపేట సొసైటీకి చెందిన అనర్హత వేటు పడ్డ ఇద్దరు డైరెక్టర్లు మిద్దెబాబు, సిద్ధిరాంరెడ్డి తమపై వేసిన అనర్హత వేటును ఎత్తివేసి, పదవుల్లో కొనసాగేలా న్యాయం చేయాలని శనివారం డీసీవోకు వినతిపత్రాలను అందజేశారు. తాను సొసైటీలో ఎలాంటి అప్పు లేనప్పటికీ సొసైటీ వారు ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చారని, తనకు పదవి నుంచి తొలగించారని సొసైటీ వైస్ చైర్మన్ అయిన జప్తి జానకంపల్లి డైరెక్టర్ మిద్దెబాబు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ విషయమై విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని ఆయన డీసీవోను కోరారు. అలాగే ఇదే సొసైటీ కి చెందిన జలాల్‌పూర్ డైరెక్టర్ సిద్ధిరాంరెడ్డి తాను కొందరు రైతులకు సొసైటీ ద్వారా ఫర్టిలైజర్ ఇప్పించగా అందుకు సంబంధించిన బకాయి డబ్బులను నెల క్రితమే సొసైటీకి పూర్తిగా చెల్లించానన్నారు. ఈ విషయంలో తనకు సమాచారం ఇవ్వకుండానే పదవి నుంచి తొలగించారని, డబ్బులు పూర్తిగా చెల్లించినందున తనకు న్యాయం చేయాలని ఆయన వినతిపత్రంలో డీసీవోను కోరారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు



కళాశాలలో మత్తు పదార్థాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పిట్లం, అక్టోబరు 25, (ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ శేఖర్ అన్నారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీసు, కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ముఖ్యంగా యువత చెడు అలవాట్లకు బానిస కాకూడదని, వాటి దూరంగా ఉండి మంచి మార్గంలో నడవాలన్నారు. మత్తులో ఎన్నో అనర్థాలు జరుగుతున్నాయని, అలా జరగకుండా మాదకద్రవ్యాలకు గంజాయి డ్రగ్స్ వాటికి దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పోలీసులు పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్పీవో ప్రసాద్‌రావు

నసురుల్లాబాద్, అక్టోబరు 25, (ఆంధ్రజ్యోతి): స్థానికంగా ఉండి ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని డీఎల్‌పీవో ప్రసాద్ రావ్ అన్నారు. మండల కేంద్రంలోని పంచాయతీ భవనంలో శనివారం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ఆయా గ్రామాలలో పారిశుధ్యం లోపించకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను సూచించారు. గ్రామాలలో పంచాయతీ సెక్రటరీలు సమయానికి రాకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రవీశ్వర్ గౌడ్‌ను ఆదేశించారు. ఎంపీఓ సూర్యకాంత్, పంచాయతీ సెక్రటరీలు సవిత, సౌందర్య, మానస, సాయిలు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పరీక్షలకు శిశుమందిర్ విద్యార్థులు



గోవిజ్ఞాన పరీక్షలకు ఎంపికైన విద్యార్థులు

కామారెడ్డిటౌన్, అక్టోబరు 25, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి గో విజ్ఞాన పరీక్షలకు పట్టణంలోని శ్రీసరస్వతి విద్యామందిర్ విద్యార్థులు 35 మంది ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ నాగభూషణం తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగే ఈ పరీక్షకు హజరుకానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

శాస్త్రీయ విద్య కోసం ఉద్యమించాలి

సుభాష్‌నగర్, అక్టోబరు 25, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శాస్త్రీయ విద్యకై ఉద్యమించాలని విజ్ఞానదర్శిని వ్యవస్థాపకులు రమేష్ అన్నారు. భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ తెలంగాణ ప్రథమ మహాసభలను జిల్లాకేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ చేపట్టారు. అనంతరం సభలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల్లో మతవిశ్వాసాలను ప్రోత్సహిస్తూ రాజకీయ పబ్బం గడపడం కోసం కుట్రలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం కోసం ఆలోచించకుండా ఓటు బ్యాంకు రాజకీయాలు చేయడం సిగ్గుచేటు అన్నారు. అఖిల భారత కార్మిక సంఘాల జాతీయ ఉపాధ్యక్షులు కామ్రేడ్ శశి కుమార్ కేరళ మాట్లాడుతూ .. ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ కేరళ గవర్నర్‌గా ఉన్నప్పుడు రాష్ట్రంలో వైస్-ఛాన్సలర్ల నియమాకం విషయంలో ఎల్డీఎఫ్ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎలా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారో చూశామన్నారు. ఇప్పుడు ఏకంగా గవర్నర్లకే అధికారం కట్టబెడితే ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలు విశ్వ విద్యాలయాలపై పట్టు కోల్పోతాయన్నారు. అన్ని వ్యవస్థల్లోకి హిందూత్వ భావజాలాన్ని చొప్పించేందుకు ప్రయత్నిస్తున్న బీజేపీ ఇకపై విశ్వవిద్యాలయాల్లో కూడా ఆర్ఎస్ఎస్ అనుయాయులను నియమించడంతో అవి కూడా కాషాయమయం అవుతున్నాయన్నారు. బహిరంగ సభలో దాదాపు 2000 మంది పైగా విద్యార్థులు పాల్గొన్నారు. జాతీయ అధ్యక్షుడు సందెకోగుల ఉదయ్ కుమార్, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రవి, మాదం తిరుపతి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గణేష్ మాలోత్ పాల్గొన్నారు.



ర్యాలీగా వస్తున్న భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ నాయకులు



మాందాపూర్‌లో కట్నంగా చీరలను అందజేస్తున్న సుభాష్‌రెడ్డి

పేదల ఆనందం కోసం సాయం

దోమకొండ, అక్టోబరు 25, (ఆంధ్రజ్యోతి): పేదవారి కళ్లల్లో ఆనందం నింపడానికి తనవంతుగా సాయం చేసేందుకు ముందుకు వస్తానని ప్రముఖ వ్యాపారి తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి అన్నారు. మాందాపూర్ గ్రామానికి చెందిన సడుగు లింగయ్య, మైసయ్య, రాజయ్య, శంకరయ్యకు, దోమకొండలో అక్కాచెల్లెల్లు కమ్మరి లక్ష్మి, కమ్మరి రాజక్కలకు కట్టి ఇచ్చిన ఐదు ఇళ్లను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాందాపూర్‌కు చెందిన వారు మాట్లాడుతూ.. 18 నెలల క్రితం గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో తమ ఇళ్లు పూర్తిగా దగ్ధమాయ్యాయి. విషయం తెలుసుకున్న సుభాష్‌రెడ్డి అదేరోజు తమకు తక్షణ సహాయం కింద రూ. లక్ష అందించారన్నారు. నూతన గృహలు నిర్మించి ఇవ్వడం పట్ల ఆయనకు జీవితంలో రుణపడి ఉంటామన్నారు. దోమకొండలో ఇద్దరు నిరుపేద మహిళలు తల్లిదండ్రులు లేక ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తూ ఇబ్బందులు పడుతున్నారన్న విషయం తెలుసుకున్న ఆయన వారికి ఇంటిని నిర్మించి ప్రారంభించారు. అనంతరం కట్నంగా ప్రతి కుటుంబానికి చీరలను అందజేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన పలువురు పాల్గొన్నారు.



నూతనంగా ఏర్పాటైన జిల్లా కార్యవర్గం

నూతనకార్యవర్గం ఎన్నిక

కామారెడ్డిటౌన్,అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ టీచర్స్‌యూనియన్(ఎస్‌టీయూటీఎస్) కామారెడ్డి జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం ఏర్పాటుచేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో రాష్ట్ర ప్రధాకార్యదర్శి సదానంద్‌గౌడ్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు జరుగగా జిల్లా అధ్యాక్షుడిగా కుంటరాములు,ప్రధానకార్యదర్శిగా పంపరి ప్రవీణ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా ఖలీమోద్దిన్, ఉపాధ్యాక్షులుగా రిజ్వానా ఆఫ్రీన్, రాజేష్,కార్యదర్శిగా రాజు, సుల్తానా, ఆర్థిక కార్యదర్శిగా శ్రీనివాస్, రాజేందర్, రాష్ట్ర కౌన్సిలర్‌గా దయానంద్‌లను కార్యవర్గం ఏర్పాటుచేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధానకార్యదర్శి మాట్లాడుతూ పెండింగ్ డీఏలు, పదవివిరమణ ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని, ఉపాధ్యాయ పదోన్నతులలో 2010కి ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని తెలిపారు. ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తు అలాగే డిమాండ్‌లు పూర్తికానిచో ఉద్యమం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఓవర్.. లోడ్, స్పీడ్, రిస్క్

(5వ పేజీ తరువాయి...)

సండే స్పెషల్ SUNDAY SPECIAL

విద్యా సంవత్సరం ప్రారంభంలో రవాణాశాఖ అధికారులు అందజేస్తున్నారు. ఆర్టీసీ బస్సుల నిర్వహణ మొత్తం ఆర్టీసీ వారే చూసుకుంటారు. ట్రావెల్ బస్సులు మాత్రం సీజన్ ను బట్టి పర్మిట్ లను రెన్యువల్ చేసుకుంటున్నారు

అప్పుడప్పుడే తనిఖీలు:

రవాణా శాఖ అధికారులు అప్పుడప్పుడు మాత్రమే బస్సుల విషయంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. పాఠశాలల ప్రారంభం అప్పుడు స్కూల్ బస్సుల తనిఖీలు చేసి మిగతా సమయంలో వాటి గురించి పట్టించుకోవడం లేదు. ట్రావెల్ బస్సుల విషయంలోనూ రవాణా శాఖ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఫిట్ నెస్ సరిగా లేకుంటే, అనుభవం ఉన్న డ్రైవర్ లేకుంటే ప్రమాదాలు జరిగే ఆస్కారం ఎక్కువగా ఉండే అవకాశాలు ఉన్నాయి. రవాణాశాఖ అధికారులు ఫిట్ నెస్ , పర్మిట్ల విషయంలో నిబంధనాలను పాటించడం లేదు. ట్రావెల్ బస్సుల్లో డ్రైవర్లు గా అనుభవం లేని వారు పనిచేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఒకరి పేరుపై అనుమతి తీసుకుని మరొకరు బస్సులకు డ్రైవర్లు గా వెళ్తున్నారని ఆరోపణలు ఎన్నో ఉన్నాయి. ఈ విషయంలో ట్రావెల్ బస్సుల యజమానుల నుంచి రవాణాశాఖ అధికారులకు మామూళ్లు అందుతుండడంతోనే ప్రైవేటు ట్రావెల్ బస్సుల విషయంలో చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

జాతీయ రహదారిపై 10 బ్లాక్ స్పాట్లు :

జిల్లా మీదుగా 44వ జాతీయ రహదారి వెళుతుంది. ఈ రహదారి గుండా నే హైదరాబాద్ నుంచి నాగపూర్ ఢిల్లీ వైపు నిత్యం వందలాది భారీ వెళుతుంటాయి. నిత్యం ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. జిల్లా మీదుగా వెళుతున్న 44వ జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరిగే 10 బ్లాక్ స్పాట్లను గుర్తించారు. గత ఆరు నెలలుగా జాతీయ రహదారులపై అధికారుల లెక్కల ప్రకారం 300కు పైనే ప్రమాదాలు జరగగా 130 మందికిపైగా మృత్యువాత పడ్డారు. ఇటీవల కామారెడ్డి జిల్లా జంగంపల్లి వద్ద టిప్పర్ బైక్ ను ఢీకొన్న ఘటనలో కే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యువాత పడ్డారు. కామారెడ్డి జిల్లా మీదుగా నిజామాబాద్ వైపు దగ్గి, సదాశివ్ నగర్, డిచ్ పల్లి , ఇంద్రాన్ పల్లి, పెర్కిట్, బాల్కొండ వైపు జాతీయ రహదారిపై నిత్యం ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతున్నాయి. అతివేగం ఓవర్ టేకింగ్ వల్లే జాతీయ రహదారులపై ప్రమాదాలు జరుగుతున్నాయి. నిద్రమత్తు కూడా ప్రమాదాలకు ఉగా కారణంగా తెలుస్తుంది. తెల్లవారుజామునే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రమాదాల విషయంలో అధికారులు జాగ్రత్తలు తీసుకుంటే తప్ప భారీ ప్రమాదాలకు అడ్డుకట్ట వేయలేం.

మత్తుపదార్థాల నిరోధానికి సమష్టి కృషి

(5వ పేజీ తరువాయి...)

వారందరూ మాదకద్రవ్యాల నిరోధానికి తమవంతు తోడ్పాటును అందించాలని పిలుపునిచ్చారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల రవాణా, వినియోగం, వాటితో ముడిపడిన కార్యకలాపాలను గమనిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. టోల్ ఫ్రీ నెంబర్ 14446 కు కాల్ చేసి కూడా సమాచారం తెలుపవచ్చని సూచించారు. ఈ సందర్భంగా నషా ముక్త్ భారత్ అభియాన్ ఐదవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సామూహిక ప్రతిజ్ఞ కోసం రూపొందించిన క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ అధికారి రసూల్‌బీ, జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

ఇందల్వాయి, అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరారంలో జాతీయ పశు వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా శనివారం పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలను వేసినట్లు మండల పశువైద్యాధికారి గంగాప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రోహిత్‌రెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ గంగాప్రసాద్, సిబ్బంది రాజు, తిరుపతి, బాలగంగారాం, సుజాత, గ్రామస్తులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

దేవి	:బైసన్ (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్	: కాంతారా చాప్టర్-1 (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్	: కె-ర్యాంప్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహాల్	: డ్యూడ్ (11.15, 2.15, 6.15, 9.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1	: కె-ర్యాంప్ (11.00, 4.40, 7.30, 10.20)
	:బైసన్ (తెలుగు) (1.35)
స్క్రీన్-2	: డ్యూడ్ (1.30,7.30)
	: తెలుసు కదా (4.30)
	:బైసన్ (తెలుగు) (10.20)
స్క్రీన్-3	:బైసన్ (తెలుగు) (11.00,4.30)
	:తమ్మ(1.50,7.30)
	:ఎక్ దివానికి దివానియత్:(హిందీ) (10.30)

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)

స్క్రీన్-1	: డ్యూడ్ (11.00, 2.05, 5.00, 7.55, 10.50)
స్క్రీన్-2	: కాంతారా చాప్టర్-1 (10.20)
	: కె-ర్యాంప్ (1.45, 7.35, 10.30)
	: మిత్రమండలి (4.40)
స్క్రీన్-3	: తెలుసు కదా (11.00, 1.55, 4.50, 7.45, 10.40)
స్క్రీన్-4	: కె-ర్యాంప్ (10.20)
	: మిత్రమండలి (1.15, 7.35)
	: కాంతారా చాప్టర్-1 (4.10, 10.30)



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.1,25,700	రూ.1,15,200	రూ.150

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.155	రూ.255	రూ. 275
వెన్‌కాబ్(కిలో)	రూ.160	రూ.260	రూ. 280



ఎకరాకు రూ.50వేల పరిహారం ఇవ్వాలి

» నష్టం అంచనాలను తక్కువగా చూపారు » మొక్కజొన్నకు బోనస్ చెల్లించాలి » ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



యంచలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

నవీపేట, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గోదావరి పరివాహక ప్రాంతంలో ముంపునకు గురైన పంటలకు ఎకరాకు రూ.50వేల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం పరిహారం చెల్లించాలని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం జాగృతి 'జనంబాట' కార్యక్రమంలో భాగంగా మండలంలోని యంచలో గోదావరి వరదలతో నీట మునిగి దెబ్బతిన్న పంటలను ఆమె పరిశీలించారు. వేల ఎకరాలలో పంట నష్టం జరిగితే అధికారులు నష్టం తక్కువగా జరిగిందని రిపోర్టులు తయారు చేశారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ ఈ విషయంలో విచారణ జరిపి రైతులకు తగిన న్యాయం చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం ఒకేసారి వరిపంటకు బోనస్ చెల్లించారని అది కూడా కొద్ది మంది రైతులకే అందిందని ఆమె పేర్కొన్నారు. మొక్కజొన్న పంటకు సైతం బోనస్ చెల్లించాలని, పసుపు పంటకు క్వింటాకు రూ.15వేల మద్దతు ధర చెల్లించాలని, సోయాపంటను వెంటనే కొనుగోలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరగడానికి వారి తరపున పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. అనంతరం స్థానిక గుట్టపై ఉన్న చారిత్రక విఠలేశ్వర ఆలయంలో కవిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీనాచారి, నర్సింగరావు, సంజీవ్, ప్రవీణ్ కుమార్, లహరి, రాజేశ్వర్, అబ్బన్న, హన్మాండ్లు పాల్గొన్నారు.



సీహెచ్ కొండూరులో లక్ష్మీనరసింహ ఆలయాన్ని దర్శించుకున్న కవిత

తడిసిన ధాన్యాన్ని కొనాలి

నిజామాబాద్ కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం షరతులు లేకుండా కొనాలని రెవెల్యూషన్ సోషలిస్ట్ పార్టీ నగర కన్వీనర్ రాములు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని నాందేవ్‌వాడలోగల పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేలాది మంది రైతుల ధాన్యం అకాల వర్షం కారణంగా తడిసిపోయిందని ప్రభుత్వం ధాన్యాన్ని యుద్ధప్రాతిపదికన కొనుగోలు చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు జిల్లా యంత్రాంగం రైతులకు భరోసా ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌వైఎఫ్ జిల్లా కన్వీనర్ నరేష్, నాయకులు అనిల్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాకళాకారులకు చేయూతనివ్వాలి

నిజామాబాద్ కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజాకళాకారులు ప్రజల పక్షాన నిలబడి ఎన్నో పోరాటాలు చేసిందని ప్రజాకళాకారుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించి చేయూతనివ్వాలని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు సిర్పలింగం అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ భవన్‌లో సాంస్కృతిక జేఏసీ ఆధ్వర్యంలో జేఏసీ నాయకుడు రాధాకృష్ణ అధ్యక్షత వహించిన అంతర్జాతీయ కళాదినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో దాసు, నర్సారెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బస్సుల ఫిట్‌నెస్ తనిఖీలు చేయాలి

నిజామాబాద్ కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా ఆర్టీవో అధికారులు ప్రైవేటు బస్సులను తనిఖీలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుకోకుండా జరిగే ప్రమాదాలకంటే ముందే ఆర్టీవో అధికారులు బస్సులను విస్తృతంగా తనిఖీలు చేసి అనుమతులు ఇవ్వాలన్నారు. స్కూల్ బస్సులను సైతం అధికారులు ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ వంటి వాటిని పరిశీలించాలని అన్నారు. సీపీఐ నగర కార్యదర్శి ఓమయ్య, రాధాకుమార్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్

కొనసాగుతున్న ఎస్సారెస్పీ నీటి విడుదల

మెండోర, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణ జిల్లాలను సస్యశ్యామలం చేస్తున్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు 4వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదల కొనసాగుతుందని ఈఈ చక్రపాణి తెలిపారు. ఎగువ ప్రాంతాల నుంచి ప్రాజెక్టులోకి 22వేల 154 క్యూసెక్కుల వరద చేరడంతో గేట్ల ద్వారా గోదావరిలోకి 12,500 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 3 వేల క్యూసెక్కులు, ఎస్కేప్‌గేట్ల ద్వారా గోదావరిలోకి 5వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 560, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం 1091 అడుగుల 80 టీఎంసీల నీటినిల్వ ఉందని ప్రాజెక్టు ఈఈ తెలిపారు.

కానిస్టేబుల్ ప్రమోద్‌కు సీపీఎం నివాళులు

నిజామాబాద్ కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కత్తిపోట్లకు గురై ప్రాణాలు కోల్పోయిన కానిస్టేబుల్ ప్రమోద్‌కు సీపీఎం నాయకులు నివాళులు అర్పించారు. నగరంలోని ప్రమోద్ కుటుంబాన్ని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు, నాయకులు పరామర్శించి ఆయన చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రమోద్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు ఈ ఘటనలో కత్తిపోట్లకు గురైన అశోక్ కూడా ఉపాధి కల్పించాలన్నారు. పోలీస్ యంత్రాంగం ఇలాంటి అరాచకాలు పునరావృతం కాకుండా కఠినంగా వ్యవహరించాలన్నారు. పరామర్శించిన వారిలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పెద్దివెంకట్రాములు, నూర్జహాన్, నాగన్న, సుజాత, మధు, శంషాద్, ఉద్దవ్ తదితరులున్నారు.



ప్రమోద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

రేపు కలెక్టరేట్ ఎదుట ధర్నా

సుభాష్ నగర్, అక్టోబర్ 25, (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల బెనిఫిట్‌లను తక్షణమే విడుదల చేయాలని ఈనెల 27న కలెక్టరేట్ ఎదుట నిరసన తలపెట్టినట్లు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సుకున్, శ్రీధర్ తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పెన్షనర్లను కోరారు. 2024 ఏప్రిల్ నుంచి పదవీ విరమణ పొందిన వారి బెనిఫిట్స్ రాష్ట్ర ప్రభుత్వం చెల్లించకపోవడంతో పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తో పెళ్లిళ్లు, ఇంటి కొనుగోలు ఇతర అవసరాల కోసం 19నెలలుగా ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదురు చూస్తున్నారు. సుమారు 16 మంది ఉద్యోగులు తీవ్ర మానసిక ఒత్తిడికి ఆందోళనకు గురై ఆత్మహత్య చేసుకోవడం, గుండెపోటుతో మరణించడం తీవ్ర ఆందోళన గురి చేస్తుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పెన్షనర్ల బెనిఫిట్స్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరసన ప్రదర్శనకు పెన్షనర్లు అత్యధికంగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అభివృద్ధికి ఇం'ధనం'

(5వ పేజీ తరువాయి...)

లేకపోవడంతో ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలనలో కార్యక్రమాలు జరుగుతున్నాయి. తెలంగాణ రైజింగ్, విజన్-2047లలో భాగంగా నగరాలతో పాటు మునిసిపాలిటీల రూపురేఖలు మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని కార్పొరేషన్లు మున్సిపాలిటీలకు కలిపి రూ.2780 కోట్లు విడుదల చేయగా జిల్లాకు రూ.61.5 కోట్ల నిధులు విడుదలయ్యాయి.

నగరంలో రూ.25 కోట్లతో అభివృద్ధి:

నిజామాబాద్ కార్పొరేషన్‌కు రూ.25 కోట్లు, బోధన్, ఆర్మూర్ మునిసిపాలిటీలకు చెరో రూ.15కోట్లు, భీంగల్ మునిసిపాలిటీకి రూ.11.5 కోట్లు విడుదల చేశారు. మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులను వినియోగించనున్నారు. నిజామాబాద్ కార్పొరేషన్‌లో నగరంలోని 8 జంక్షన్‌లను ఈ నిధుల ద్వారా అభివృద్ధి చేయనున్నారు. నగర ముఖచిత్రాన్ని మార్చే విధంగా నగరంలోని రాజీవ్ గాంధీ జంక్షన్, నెహ్రూ పార్క్ జంక్షన్, పులాంగ్ చౌరస్తా, వర్ని చౌరస్తా, ఎల్‌ఐసి చౌరస్తా, బైపాస్ రోడ్డు లోని కాలూర్ రోడ్డు జంక్షన్, వసంత్‌నగర్ జంక్షన్‌ను అభివృద్ధి చేయనున్నారు. పార్కుల అభివృద్ధితోపాటు సీసీ రోడ్లు, డ్రెయినేజీలను నిర్మించేందుకు ఈ నిధులను వెచ్చించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ తెలిపారు.

పేదల కల సాకారం హర్షణీయం

» జైతాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం
» బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి » పాల్గొన్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

ఎడపల్లి, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల సాకారం చేయడం తనకు సంతోషంగా ఉందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని జైతాపూర్‌లో ఇందిరమ్మ పథకం కింద నిర్మాణాలు చేపట్టి పూర్తి చేసుకున్న ఇళ్లను శనివారం జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డితో కలిసి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ప్రారంభోత్సవాలు చేశారు. ప్రభుత్వం ఇందిరమ్మ పథకం కింద తోడ్పాటుతో ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులను అభినందిస్తూ వారిచే గృహ ప్రవేశాలు చేయించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పేదలకు అన్ని సదుపాయాలతో కూడిన సొంతింటిని ఇల్లు కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఒక్కో ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాలయల ఆర్థికసాయం అందిస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉచితంగా ఇసుకను అందిస్తున్నామని, ఐకేపీ, మెప్మా ద్వారా విరివిగా రుణాలు మంజూరు చేయిస్తున్నారని గుర్తుచేశారు. ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును అందిపుచ్చుకుని మండలంలోని జైతాపూర్‌లో దాదాపు పది ఇళ్లు పూర్తి చేసుకుని గృహ ప్రవేశాలు జరిగాయని, ఇంకా 60 స్లాబ్ దశలో ఉన్నాయని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకున్న వారి స్ఫూర్తితో మిగతా వారు వెంటనే నిర్మాణాలు చేపట్టాలన్నారు.



ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న కలెక్టర్, బోధన్ ఎమ్మెల్యే

గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రంలో విద్యుత్ వసతి, మహిళాశక్తి భవనానికి టాయిలెట్స్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర సహకార సంఘాల కార్పొరేషన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, హౌసింగ్ పీడీ పవన్, తహసీల్దార్ దత్తాత్రి, ఎంపీడీఓ శంకర్ పాల్గొన్నారు.

ఆడబిడ్డను.. ఆశీర్వదించండి

(5వ పేజీ తరువాయి...)

విద్యార్థులు సహా అన్ని వర్గాలతో మాట్లాడి ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేస్తానని, ప్రతి ఒక్కరి ఆత్మగౌరవంతో కూడిన అభివృద్ధే తన ఆకాంక్ష అని అన్నారు. పేదవారికి ఇళ్లు, వైద్యం, విద్య అందాలని, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి పరిస్థితి దారుణంగా ఉందన్నారు. ఈ విషయంలో జిల్లాకు చెందిన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం దారుణమన్నారు. ఆమె వెంట తెలంగాణ జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, జిల్లా జాగృతి అధ్యక్షుడు అవంతి రావు, శ్రీనివాస్ గౌడ్, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

ఘన స్వాగతం పలికిన జాగృతి నాయకులు:

బీఆర్ఎస్ పార్టీ నుంచి బహిష్కరణకు గురై మొట్టమొదటిసారి జిల్లాకు వచ్చిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు తెలంగాణ జాగృతి నాయకులు ఘన స్వాగతం పలికారు. ఇందల్వాయి టోల్ గేట్ నుంచి మొదలుకొని నిజామాబాద్ నగరం వరకు పెద్ద సంఖ్యలో నాయకులు కార్యకర్తలు స్వాగతం పలికారు. మాధవ్ నగర్ వద్ద నుంచి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు

84వేల ఎకరాలకు నీళ్లు అందించాలని ధర్నా

నిజామాబాద్ కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మంచిప్ప 21 ప్యాకేజీ పనులు పూర్తి చేసి 84వేల ఎకరాలకు నీళ్లు అందించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత రైతు కూలీ సంఘం ధర్నా నిర్వహించింది. శనివారం జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్ వద్ద నిర్వహించిన ధర్నాలో నాయకులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య మాట్లాడుతూ.. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మంచిప్ప ప్రాజెక్టు కోసం 2623 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 21 ప్యాకేజీ పనులు ప్రారంభించి మధ్యలోనే నిలిపివేసిందన్నారు. 2022 3650 కోట్ల అంచనా పెంచి నిధులు కేటాయించలేదన్నారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లిన కాలయాపన జరుగుతుందని ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి 21ప్యాకేజీ పనులు పూర్తి చేసి నీటిని అందించాలన్నారు. ధర్నాలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు పాపయ్య, జిల్లా ప్రధాన కారన్యదర్శి సాయిరెడ్డి, దాసు, అబ్దుల్, సాయినాథ్, శ్రీనివాస్‌రెడ్డి, బన్సీలాల్, గంగన్న, సాయిలు, వివిధ ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

సుభాష్‌నగర్,అక్టోబర్ 25,(ఆంధ్రజ్యోతి): పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కాలేజ్ ముందు రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇందూరు విభాగ కన్వీనర్ శశిధర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. కార్యక్రమంలో దుర్గాదాస్, సన్నీ, సిద్దు, విగ్నేష్, తోని కార్తీక్, హరీష్, అఖిలేష్, శశాంక్, రంజిత్, లక్కీ తదితరులు పాల్గొన్నారు.